


అఖిలాండేశ్వరికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి



ప్రజాశక్తి - కలిదిండి

అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో మండలంలోని గుర్వాయిపాలెం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి రాజులపాటి అఖిలాండేశ్వరి ద్వితీయ స్థానంలో నిలిచింది. అఖిలాండేశ్వరికి శుక్రవారం చింతలపూడి వికె కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చేతుల మీదుగా సర్టిఫికెట్, రూ.ఐదు వేల నగదు బహుమతిని అందజేసినట్లు ప్రధానోపాధ్యాయిని బి.ప్రసన్న కుమారి తెలిపారు.

బిజెపి నుంచి..
దేశాన్ని కాపాడుకోవాలి
సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నేతలు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి యాత్ర జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నేతలు ఇంటింటికీ వెళ్లి బిజెపి వైఖరిని ఎండగట్టారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.



ఏలూరులో ప్రచార భేరిని ప్రారంభిస్తున్న దేగా ప్రభాకర్, బి.సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు

బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రమాదం నుండి దేశాన్ని కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్నవకృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార భేరి యాత్రను వారు ప్రారంభించారు. తొలుత ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం, సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, సిపిఐ సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత వహించారు. ప్రభాకర్, రవి, కృష్ణచైతన్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అదాని, అంబాని వంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. మరోవైపు పేదలపై మోడీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజిల్, కరెంటు ఛార్జీలను మోయలేని విధంగా పెంచి నడ్డి విరుస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గ్రామీణ పేదలకు అన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని సైతం మోడీ ప్రభుత్వం అటకెక్కిస్తోందని విమర్శించారు. మహిళలకు, దళితులకు, మైనార్టీలకు, గిరిజనులకు దేశంలో రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నిధులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తదితర అనేక అంశాల్లో రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేస్తుందని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి రాష్ట్రానికి నిధులు రాబట్టాల్సిన వైసిపి ప్రభుత్వం కేంద్రానికి లొంగి వ్యవహరిస్తుందని, ప్రతిపక్షాలైన టిడిపి, జనసేన సైతం బిజెపిని నిలదీయడం లేదని గుర్తు చేశారు. ప్రచార భేరి యాత్రను సిపిఐ నేత డేగా ప్రభాకర్, సిపిఎం నాయకులు బి.సోమయ్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నేతలు కె.శ్రీనివాస్, పివి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, కె.విశ్వనాథం, వి.సాయిబాబు, బి.జగన్నాథం, జె.గోపీ, కె.రామాంజనేయులు, విజిఎంఆర్.కృష్ణారావు, సిపిఐ నాయకులు కురెళ్ల వరప్రసాద్, తెర్లాపు శ్రీను, సుబేదార్‌ఖాన్, మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీఇందిరా, భజంత్రీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఐ మండల కార్యదర్శి మైనాక్షి వెంకటాచారి అన్నారు. ప్రచార భేరి యాత్రను స్థానికంగా శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో నాగేంద్రరావు, వెంకటాచారి మాట్లాడారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నేతలు కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, సోడె నాగేష్, వరసా నాగేశ్వరరావు, మారయ్య, కణితి రాము, పూరెం లక్ష్మయ్య, మహబూబ్ పాషా, పట్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


కామవరపుకోటలో ప్రచార భేరిని ప్రారంభిస్తున్న ఫ్రాన్సిస్

పోలవరం: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రచార భేరి కార్యక్రమం ప్రారంభించామని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, నేత బొరగం భూచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో నేతలు మిడియం గంగాదేవి, కుంజం మంగ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: మోడీ పాలనలో అన్ని తరగతుల ప్రజలు ఇబ్బందుల్లో పడ్డారని సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్.రాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుదాం' అనే నినాదంతో శుక్రవారం కామవరపుకోటలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. తొలుత సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊటి ప్రచార భేరి ప్రారంభించారు. కామవరపుకోట, జీలకర్రగూడెం, కళ్లచెరువు, రత్నగిరినగర్, తడికలపూడి, ఆడమిల్లి ఈస్ట్, యడవల్లి, రామన్నపాలెం, రావికంపాడు తదితర గ్రామాల్లో జరిగిన సభల్లో నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నేతలు బి.రాంబాబు, ఎ.ప్రభాకర్, పి.సూర్యారావు, ఎస్‌కె.సుభాషిణి, ఎ.ఫ్రాన్సిస్, బుచ్చిబాబు పాల్గొన్నారు.


టి.నరసాపురం: కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు బిఎన్.సాగర్, సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ పిలుపునిచ్చారు. సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి యాత్రను శుక్రవారం సిపిఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు ప్రారంభించారు. తొలుత చిన్నగుర్వాయిగూడెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తాడిగడప జయరాజు, వీరంకి వెంకట్రావు. పోలగాని సత్యనారాయణ, బాబూరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రజలను రక్షించుకోవడం కోసం సిపిఎం, సిపిఐ ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం చేబ్రోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో కె.వెంకట్రావు అధ్యక్షతన ఉంగుటూరు నియోజకవర్గ సమావేశం జరిగింది. లింగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం, సిపిఐ ఈ నెల 14 నుంచి 30 వరకు రాజకీయ ప్రచారభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నాయని, దీనిలో భాగంగా నియోజకవర్గంలో ఈ నెల 17, 18 వ తేదీల్లో జరిగే కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు సీరా అప్పారావు, నక్క సుబ్బారావు, నారపల్లి రమణారావు, కట్టా భాస్కరరావు, కోన శ్రీనివాసరావు, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి.మునీర్ పిలుపునిచ్చారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మునీర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, ఇరు పార్టీల నేతలు మడివి దుర్గారావు, కారం ధారయ్య, యర్రా మధు, వంగపండు రాంబాబు, కారం వెంకట్రావు, గుమ్మల నర్సయ్య పాల్గొన్నారు.

చింతలపూడి పూర్తి చేస్తాం

మామిడి రైతులను ఆదుకుంటాం
మల్లవల్లి టౌన్‌షిప్ నిర్మించి ఉద్యోగాలిస్తాం
నూజివీడు ఎంఎల్ఎ కుమారుడు నిలువు దోపిడీ
ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలి
నూజివీడు పర్యటనలో చంద్రబాబు


విక్టరీ సింబల్ చూపుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, నూజివీడు, రూరల్

అధికారంలోకి రాగానే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ప్రతి ఎకరానికీ నీరందిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం నూజివీడు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించారు. మర్రిబంధం నుంచి చంద్రబాబు రోడ్డుషో కొనసాగింది. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బైకులు, కార్లపై వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. క్రేన్‌తో గజమాల వేసి ఆహ్వానించారు. జనం పెద్దఎత్తున రోడ్డుపైకి రావడంతో రోడ్డుషో నెమ్మదిగా సాగింది. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి చంద్రబాబుకు ఆహ్వానం పలికారు. రాత్రి 9 గంటలకు నూజివీడులోని పెట్రోల్ బంకు సెంటర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగిపోయాయంటూ సిలిండర్ చూపించింది. తొలుత టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ రైతులు, కూలీలు, తోపుడుబళ్లవారు, కార్మికులు ఏ ఒక్కరినీ జగన్ వదల్లేదన్నారు. ముద్దులకు మోసపోయి పిడిగుద్దులు తింటున్నారన్నారు. సంపద సృష్టి లేకుండాపోయిందన్నారు. రూ.60 ఉండే మద్యం సీసాను రూ.200 నుంచి రూ.300 వరకు పెంచారన్నారు. మద్యంపై వచ్చే పర్సంటేజీ ఎక్కడికి పోతుందన్నారు. జగన్ పాలన చూసి విద్యార్థులు తెలంగాణ ఎంసెట్‌కు వెళ్లిపోతున్నారన్నారు. రూ.లక్షల కోట్లు జగన్, ఎంఎల్ఎలు దోచుకుతింటున్నారన్నారు. పోలవరం పోయిందని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సర్వనాశనం చేశారన్నారు. బందరు పోర్టు పోయిందని, భోగాపురం విమానాశ్రయం, కడప స్టీల్ ప్లాంట్ ఏ ఒక్కటీ లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నూజివీడు నియోజకవర్గంలో మల్లవల్లి టౌన్‌షిప్ నిర్మించి రూ.50 వేల ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ చేపడతామన్నారు. మామిడి అంటేనే నూజివీడుకు ప్రత్యేకత ఉందని మొన్నటివరకు రూ.40 వేలు ఉన్న ధర రూ.8 నుంచి 10 వేలకు పడిపోయిందన్నారు. వర్షాలకు పంట దెబ్బ తిన్నా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. టిడిపి అధికారంలో ఉంటే మామిడి రైతులను ఆదుకునేవారమన్నారు. పామాయిల్ పంటను కూడా టిడిపి తెచ్చిందని, ధర తగ్గితే సబ్సిడీ ఇచ్చేవారమని చెప్పారు. రైతులకు ఒకేసారి రూ.50 వేలు రుణమాఫీ చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా చేసేవారమన్నారు. రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడో స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక రైతులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. నూజివీడుకు ఔటర్ రింగురోడ్డు కావాలంటున్నారని, టిడిపి వచ్చిన వెంటనే ఇస్తామని చెప్పారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయిస్తామని, ట్రిపుల్ ఐటీని అభివృద్ధి చేస్తామన్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందంగా ఎంఎల్ఎ కుమారుడు దుకాణం పెట్టేశారన్నారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల్లో బరితెగించారన్నారు. ఉచితంగా ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగిరిపల్లి మండలంలో క్వారీలు కొల్లగొడుతు న్నారన్నారు. నూజివీడులో రూ.300 కోట్లతో 3100 టిడ్కో ఇల్లు నిర్మిస్తే లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడు పెట్టేశారన్నారు. నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారని, జిల్లాల విభజనలో ఉన్న సమస్యలను అధికారంలోకి వచ్చాక సరిచేస్తామన్నారు. పేదల ఆర్థిక అసమానతలు తొలగించేందుకు, నిరుపేదలను గుర్తించి అండగా ఉండే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. తన పర్యటనకు సంబంధించి స్థానిక డిఎస్‌పి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారని, తాము అధికారంలోకి వచ్చాక పొరపాట్లు చేసే అధికారులను వదలబోమని హెచ్చరించారు. ప్రజలు మారాలని, చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాగంటిబాబు, స్థానిక టిడిపి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


ప్రజాసంఘాల ఆధ్వర్యాన చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభించిన ప్రముఖులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎపి పట్టణ పౌర సమాఖ్య (ఎపియుసిఎఫ్) ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ వజ్ర కిరణ్ అన్నారు. శుక్రవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పేరంపేట రోడ్డులో కరెంట్ ఆఫీస్ ఎదురుగా పదో సంవత్సరం ఏర్పాటు చేసిన అమ్మ చలివేంద్రంను డాక్టర్ వజ్రకరణ్ ప్రారంభించారు. తొలుత డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.మాబు సుభాని అధ్యక్షతన 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ తెల్లగారపు జ్యోతి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కీర్తిశేషులు మానకొండ జైకాంతరాజు జ్ఞాపకార్థం వారి కుమారులు మానుకొండ మనోజ్ వంశీలు మజ్జిగ , కూలింగ్ వాటర్ పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ వజ్ర కిరణ్ చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు మానకొండూరు నాగార్జున, మునపర్తి రాముడు, చిన్న, ఎస్‌కె.బాజీ, ప్రసాద్, బి.యశ్వంత్, మణి, వంగ గోపీ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మహోన్నతుడు అంబేద్కర్
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్


చింతలపూడి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కొనియాడారు. పట్టణంలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు, కులాలు, జాతుల వారికి సమాన హక్కులు ఉండాలని పేర్కొంటూ వాటిని రాజ్యాంగంలో పొందుపర్చి సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహోన్నతుడు అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ జానకీరెడ్డి, జెడ్‌పిటిసి ఎం.నీరజ, ఎంపిపి బి.రాంబాబు, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వభరత్, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, ఆర్‌డిఒ ఝాన్సీరాణి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఇఒ ఎన్‌వి.రవిసాగర్, జిల్లా మైనారిటి సంక్షేమాధికారి కృపావరం, జిల్లా బిసి సంక్షేమాధికారి నాగరాణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పశుసంవర్ధక శాఖ జెడి జి.నెహ్రూబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, మున్సిపల్ కమిషనర్ నల్లా రాంబాబు, ఎండిఒ మణికుమారి, నేతలు పల్నాటి బాబ్జి, పొలిమేర హరికృష్ణ, జె.లక్ష్మణరావు, ఉమామహేశ్వరరావు, బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: జెసి

ఏలూరు: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద 132వ జయంతి వేడుకలు మెప్మా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు జాయింట్ కలెక్టర్ లావణ్య వేణు, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, మెప్మా పీడీ బి.ఇమ్మానుయేల్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, దళిత నాయకులు, ప్రజలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లావణ్య వేణు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టరేట్లోని గౌతమి సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ లావణ్య వేణు, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ద్వారకతిరుమల: మండలంలోని పంగిడిగూడెం సెంటర్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెలికాని రాజబాబు, వాసు, బొండాడ వెంకన్నబాబు, జెడ్‌పిటిసి శామ్యూల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న జెసి లావణ్య, డిఆర్ఒ మూర్తి

వివిధ దశల్లో 83 వేల ఇళ్ల నిర్మాణం

21 వేల ఇళ్లు గృహప్రవేశాలకు సిద్ధం

నాగిరెడ్డిగూడెం లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎంఎల్ఎ ఎలిజా

చింతలపూడి: జిల్లాలో 83 వేల జగనన్న ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. మండలంలోని నాగిరెడ్డిగూడెంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఎంఎల్ఎ విఆర్.ఎలిజా, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగిరెడ్డిగూడెం లేఅవుట్‌లో 433 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టగా వాటిలో 200కు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్లు కూడా ఈ వేసవి ముగిసేలోపు పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యపర్చుతామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 87 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పట్టాలు కూడా అందించామని, వాటిలో 83 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారని, పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఇంతవరకు 21 వేల జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జగనన్న లేఅవుట్లలో అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామన్నారు. ఇళ్లు మంజూరైన డ్వాక్రా మహిళలకు ఇళ్ల నిర్మాణానికి అదనంగా రూ.35 వేలు రుణంగా అందిస్తున్నామని, దీని కారణంగా ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతమైందని అన్నారు. జిల్లాలో జగనన్న ఇళ్ల లేఅవుట్లు అవసరమైన చోట్ల ఎంత ఖర్చయినా మెరక చేసి, ఇళ్ల నిర్మానానికి అనువుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, ఎంపిడిఒ మణికుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రమాదేవి, ఎంఎల్‌సి సాబ్జీ, పక్కనే ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సమాజంలో సామాజిక అంతరాల తొలగింపునకు మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చూపిన బాటలో ఉపాధ్యాయులు మహిళా అభ్యున్నతితోపాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, షేక్ సాబ్జీ పిలుపునిచ్చారు. జ్యోతిబా పూలే, అంబేద్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షతన శుక్రవారం జిల్లా మహిళా చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సిలు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలకు విద్య అందిస్తున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక విద్యారంగాన్ని కావాలనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేస్తుందన్నారు. యుటిఎఫ్ కార్యకర్తలు విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపర్చి ఐక్యతతో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం-సామాజిక న్యాయం అనే అంశంపై ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ అంబేద్కర్ మన దేశానికి ప్రసాదించిన భారత రాజ్యాంగంలోని అనేక అంశాలకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. సామాజిక స్పృహ కలిగిన కార్యకర్తలుగా ప్రజాచైతన్యంతో అన్ని వర్గాలను కలుపుకొని భారత రాజ్యాంగం, ప్రభుత్వ రంగాలను కాపాడుకోవడం కోసం పాటుపడాలన్నారు. ముఖ్యవక్త ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలు లేనిదే ఏ అంశమూ లేదని, ఆ విధంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ఉద్యమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా హక్కులు, రాయితీలు పొందినటువంటి చరిత్ర ఉందని గుర్తు చేశారు. మహిళలు శ్రామిక చైతన్యంతో వర్గ పోరాటాల్లో పాల్గొని విజయాలు సాధించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్, గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, అసోసియేట్ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు బి.అనురాధ, ఎస్.సుధారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ మాట్లాడారు. జిల్లా కోశాధికారి షేక్ ముస్తఫా అలీ వందన సమర్పణ చేశారు.

అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి


నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ఏలూరు: సామాజిక విప్లవకారుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. స్థానిక ఉద్దరాజు రామం భవనంలో శుక్రవారం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత అంబేద్కర్ చిత్రపటానికి రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అంబేద్కర్ కొందరివాడు కాదని, అందరి వాడనే విషయాన్ని గుర్తించాలన్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని, ఆ కాలంలోనే కులవివక్ష, మతన్మోదంపై పోరాడిన నాయకుడని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను మంటకలిపే పద్ధతులో ప్రస్తుతం బిజెపి వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు కె.శ్రీనివాస్, బి.సోమయ్య, పి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, కె.విశ్వనాథం, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, వివివిఎస్.ప్రసాద్, ఎం.రామాంజనేయులు, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల భవనాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశించారు. గురుకుల పాఠశాల భవనాల నిర్మాణ పనులను స్థానిక ఎంఎల్ఎ ఎలిజాతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.7.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఈ పాఠశాలను మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నారని, నిర్మాణ పనులను పూర్తి చేసి, ఈ విద్యాసంవత్సరం జూన్ నుంచి తరగతులను కొత్త భవనంలో నిర్వహించే దిశగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలో టాయిలెట్లు వెంటనే పూర్తిచేసి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. డ్రైన్, ప్లాస్టరింగ్, విద్యుత్ సౌకర్యం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులన్నీ పూర్తి నాణ్యతతో ఉండాలన్నారు. గురుకుల పాఠశాల పక్కనే వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ కలెక్టర్ అపూర్వభరత్, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, ఎంపిడిఒ మణికుమార్ పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి సహకరిస్తా : ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మహమ్మదీయ మసీదు అభివృద్ధికి సహకరిస్తానని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన భీమడోలు మండలంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా అంబరుపేట, చెట్టున్నపాడు గ్రామాల్లో నిర్మించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భీమడోలు మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ హసేన్ ఎంఎల్ఎను సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇమామ్ దిల్దార్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పి.సునీతమాన్సింగ్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, భీమడోలు వైసిపి అధ్యక్షులు ఆర్.సత్యశ్రీనివాస్, ఎంపిపి కె.రమయ్య, ఎఎంసి వైస్ పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎంఎల్ఎ వాసుబాబు

అంబేద్కర్‌నగర్‌గా హరిజనపేట

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక హరిజన పేటకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నగర్‌గా పేరు మార్పు చేశామని మున్సిపల్ కమిషనర్ రషీద్‌ప్రసాద్ తెలిపారు. హరిజనపేట-1 సచివాలయానికి బాబూ జగ్జీవన్‌రామ్ సచివాలయంగా, హరిజన పేట-2 సచివాలయాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంగా పేరు మార్పు చేశామని తెలిపారు.

పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం చట్టబద్ధ గ్రామసభలను ఆయా సర్పంచుల అధ్యక్షతన నిర్వహించారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామపంచాయతీల వద్ద నిర్వహించిన గ్రామ సభలకు ఆయా సర్పంచులు సునీత మాన్సింగ్, రహీమా బేగం హసేన అధ్యక్షత వహించారు. ఈ రెండు చోట్ల గ్రామపంచాయతీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎన్.దాగూర్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. భీమడోలులో జరిగిన గ్రామసభలో లింగాపాలెం గ్రామానికి ప్రత్యేక పైపులు ఏర్పాటు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల అభివృద్ధి అధికారి రాఘవనేత్ పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభల్లో ప్రజలు పలు సమస్యలను సర్పంచుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. ముదినేపల్లి, అల్లూరు, బొమ్మినంపాడు, చిగురుకోట, చినపాలపర్రు, దాకరం, పెయ్యేరు, పెదపాలపర్రు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

దీపికకు పలువురి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి దీపిక మట్టిలో మాణిక్యంలా కిక్ బాక్సింగ్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించినట్లు కోచ్ అంజిబాబు తెలిపారు. గ్రామంలోని అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కిక్‌బాక్సింగ్‌లో రాణించిన దీపికను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించి నగదు బహుమతిని అందించారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం గ్రామానికి చెందిన రేపాక శ్రీనివాస్ అనారోగ్యంతో రాజమండ్రి సాయి హాస్పటల్‌లో చేరగా చికిత్సకు డబ్బు లేక ఇబ్బంది పడుతుండగా కుటుంబ సభ్యులు, బంధువులు ఆర్యవైశ్య సంఘాన్ని ఆశ్రయించారు. దీంతో ఆర్య వైశ్య సంఘం నాయకులు సభ్యులందరూ కలిసి వెంటనే స్పందించి రూ.43 వేలు ఆర్థిక సహాయం చేశారు.

నేరాలు - ఘోరాలు

స్తంభంపై నుంచి పడి అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

స్తంభంపై నుంచి జారిపడి అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి చెందిన ఘటన విఆర్ఎం ఫంక్షన్ హాలు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకాతిరుమల సబ్ స్టేషన్ పరిధిలోని అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పాతూరి ధర్మేంద్ర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విఆర్ఎం ఫంక్షన్ హాలు వద్ద ఉన్న విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా జారి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. అతడిని అక్కడివారు ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

వణుదుర్రులో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని వణుదుర్రులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుదుర్రు గ్రామ కొత్త హరిజనవాడకు చెందిన మద్దెల నందిరాజుకు చెందిన పూరింట్లో శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంటిలో వృద్ధురాలు మంగమ్మ చిన్న పిల్లలతో ఉంది. కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లారు. ఇంటికి నిప్పంటుకున్న విషయం గమనించిన మంగమ్మ బయటకు వచ్చి కేకలు వేయడంతో గ్రామస్తులు వెంటనే స్పందించి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని వస్తువులు, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. కుటుంబసభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. కైకలూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది పరిశీలించి ఆస్తినష్టం అంచనా వేశారు. రూ.లక్షకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్ని ప్రమాద బాధితులు మద్దెల నందిరాజు, మంగమ్మ దంపతులు తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం ఎస్ఇబి తనిఖీ కేంద్రం సమీపంలో శుక్రవారం ఎస్ఇబి సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణలోని అశ్వరావుపేట నుంచి ఆంధ్రాకు తరలిస్తున్న తొమ్మిది బీర్ సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఇబి ఎస్ఐ ప్రకాష్ తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఆర్ఆర్ పేటలోని బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా కార్యాలయంలో బిసి హక్కుల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి హక్కుల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, బిసి హక్కుల మహిళ సాధికారత నాయకురాలు గుత్తుల బాల త్రిపుర సుందరి, గుత్తుల దుర్గాప్రసాద్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నగర నాయకులు ఉద్దపల్లి కిషోర్ నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలో ఉన్న జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏలూరు టౌన్ : స్థానిక హెడ్ పోస్టాఫీసు కార్యాలయ సమీపంలో ఎన్‌హెచ్‌ఆర్‌పి ఫోరమ్ సభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి స్థానిక న్యాయవాదులు గారపాటి నాగేశ్వరరావు, బాబు గణేష్, నారాయణ కాలేజ్ ప్రిన్సిపల్ రవికుమార్, గద్దె విజయ్‌కుమార్, పసుపులేటి శ్రీనివాస్, మంగిపూడి అరుణ రమణబాబు, గంటా యేసుపాదం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌పి ఫోరమ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు కాసారి గంగన్న మాట్లాడారు. స్థానిక ఏలూరు దొండపాడు వద్ద ఉన్న పరివర్తన్ చెవిటి, మూగ పాఠశాలలో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందించారు.

ద్వారకాతిరుమల : అంబేద్కర్ జయంతి సందర్భంగా ద్వారకాతిరుమల బ్యాంక్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి గ్రామ సర్పంచి స్వర్ణలత సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల ఎంపిటిసి సభ్యులు-1 రుద్ర సూర్యకళ వెంకటశివాజీ, ఎంపిటిసి సభ్యులు -2 పెద్దిరెడ్డి రమ్యకుసుమనాగేశ్వరరావు, 11వ వార్డు మెంబర్ చిలుకూరు నాగసుబ్రహ్మణ్యం, 14వ వార్డు మెంబర్ ఉర్ల శ్రీనివాస్, పొంగులేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


భీమడోలులో....


భీమడోలు : భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెం ఆవాస ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.స్వర్ణకుమారి, కెవిపిఎస్ మండల కన్వీనర్ టి.సుమంబాబు, వ్యవసాయ శాఖ విశ్రాంత సంచాలకులు జి.ప్రసాదరావు, విశ్రాంత ఎంపిడిఒ కోటయ్య, విశ్రాంత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శర్మ పాల్గొన్నారు. భీమడోలు తహశీల్దార్ కార్యాలయం, పొలసానిపల్లిలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాలకు తహశీల్దార్ షంషుద్దీన్ పాల్గొన్నారు. గుండుగొలనులో అంబేద్కర్ యూత్, కెవిపిఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ముసునూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ దాసరి సుధ, సిల్క్ నగర్ పాఠశాలలలో ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఎంపిపి పాఠశాలలో హెచ్.హన్నామణి, వేల్పుచర్లలో టిడిపి నాయకులు పర్వతనేని గంగధరరావు, మానం వంశీ, మానం విజయ్‌కుమార్, కాట్రేనిపాడులో సర్పంచి సుహాసని మోహన్‌రావు, చింతలవల్లిలో పిల్లి మురళి, లోపూడిలో జెడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, సర్పంచి పేరం కృష్ణ, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, గోపవరంలో సర్పంచి కంచర్ల వాణి, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, కోర్లగుంటలో సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సుందరరావు, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, వలసపల్లిలో సర్పంచి చలసాని దామెదరరావు, సిపిఎం నాయకులు, గుడిపాడులో టిడిపి నాయకులు కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథ పాలకులు రాముడు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తెలుగు రచయిత(కవి) ఊటుకూరి వరప్రసాద్ హాజరయ్యారు.

బుట్టాయగూడెం : మండలంలోని అంబేద్కర్ కాలనీలో, నూతిరామన్నపాలెం, కన్నాపురం, రామారావుపేట సెంటర్, రెడ్డి గణపవరం గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు ఆయా గ్రామాల పెదలు, యువత పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చింతలపూడి : స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలో టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రుదేవ, ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ముళ్లగిరి సుందరమ్మ, ఎస్‌సి సెల్ చింతలపూడి మండల అధ్యక్షులు నందిపాము నాగేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలో పలుచోట్ల అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


నిడమర్రులో...

నిడమర్రు : నిడమర్రు మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు, అభ్యుదయవాది, వామపక్ష అభిమాని కిలారి అప్పారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ కోన శ్రీనివాసరావు, మోహన్‌రావు, ప్రగడ మణికంఠ, పొట్నూరి గణపతి, బార్నాల పెద్దిరాజు, వడలి వీర్రాజు, వానపల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లిలో సర్పంచి చిర్రి జగదాంబ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహానికి సర్పంచి సున్నం ఉషారాణి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. దర్భగూడెం, జీలుగుమిల్లి అంబేద్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, ఉప సర్పంచి రాఘవరెడ్డి, విద్యావేత్తలు సముద్రాల రామారావు, లక్ష్మీప్రసాద్, పి.కృష్ణ, అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ సతీష్, మధు పాల్గొన్నారు.

ఉంగుటూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు ఎవి.రమణరావు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ ఆంజనేయులు, నారాయణపురంలో సర్పంచి దిడ్ల అలకనంద, పలు గ్రామాల్లో జనసేన నియోజకవర్గ బాధ్యులు పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మండవల్లి : మండవల్లి అంబేద్కర్ ప్రయివేట్ ఎలక్ట్రికల్ యూనియన్ దళిత వాడ యూత్ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకాన్ని చేసి అనంతరం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆధ్వర్యంలో, పిహెచ్‌సిలో వైద్యాధికారి జె.జగన్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మన హక్కులకై పోరాడు-సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.సురేష్‌బాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలవరం : మండలంలోని ప్రగడపల్లి, చేగొండపల్లి, ఇటుకలకోట, బోడిగూడెం, పోలవరం, కమ్మరగూడెం, నూతనగూడెం, యడ్లగూడెం, పట్టిసీమ, గూటాల, కొత్త పట్టిసీమ గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు బుగ్గ మురళి సుంకర వెంకట రెడ్డి, దళిత నాయకులు అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానికులు, సచివాలయం సిబ్బంది అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కె.లక్ష్మణరావు మాట్లాడారు. స్థానిక వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులు బస్టాండ్ వరకు ర్యాలీ చేసి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ జగన్ మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. స్థానిక ఎనిమిదో వార్డులో అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు పూలమాలవేసి జోహార్లు తెలిపారు.



జంగారెడ్డిగూడెంలో..

నూజివీడు : పట్టణంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి కమిషనర్ సయ్యద్‌అబ్దుల్ రషీద్ పూలమాల వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో బాపూ నగర్‌కు వెళ్లే దారి వెంబడి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ద్వారకా ఎస్టేట్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ పాల్గొన్నారు. మాజీ మంత్రి ప్రతిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ పరిధిలో కొనసాగే డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.వెంకటరాము, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎస్‌కె అన్వర్ బాష మాట్లాడారు.

చాట్రాయి : మండలంలోని చిన్నంపేట గ్రామంలో కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

కలిదిండి : ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరలక్ష్మి జ్యూయలర్స్ షాప్ ఎదుట సొసైటీ అధ్యక్షులు పూర కల్యాణి, శ్రీధర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాల మహానాడు మండల అధ్యక్షులు బోడిగడ్డ కిషోర్ ఆధ్వర్యంలో 300 టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఆవకూరు, కొచ్చర్ల గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పూలమాలలు వేసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కోరుకొల్లు, సానా రుద్రవరం, కలిదిండి, భాస్కరరావు పేట గ్రామాల్లో సంఘ నాయకులు శేషపు మహంకాళరావు, జక్కుల మహేష్, చిన్నం శ్రీకాంత్, జోగి ఏసు, పంతగాని ప్రకాష్, అద్దాని వెంకటేశ్వరరావు, కుడిపూడి శ్రీనివాసరావు, దొంగ వెంకట సత్యన్నారాయణ, గద్దె అనిల్, కిషోర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

టి.నరసాపురం : మండలంలోని పుట్రేపు, టి.నరసాపురం, చినగుర్వాయిగూడెం, తిరుమలదేవిపేట, వీరభద్రవరం గ్రామాల్లో నాయకులు అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, కాటేపల్లి సత్యనారాయణ, రాజుపోతేపల్లి ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం పట్టణంలో ఎస్‌సి కాలనీలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు.

చాట్రాయి : మండలంలోని చనుబండ గ్రామపంచాయతీలోని సూరంపాలెంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ కమ్యూనిటీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్ డి.మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, లీడింగ్ ఫైర్‌మెన్ రవి కుమార్, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ కార్యదర్శి మారగాని శ్రీనివాసరావు, లయన్స్ 316 -జి జిల్లా రీడింగ్ ఏక్షన్ ప్రోగ్రామ్స్ ఛైర్మెన్ కృష్ణారావు, రెడ్ క్రాస్ తరపున వైద్య విద్యార్థినులు పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో నివాళి అర్పించారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

భీమడోలు : భీమడోలు అగ్నిమాపక కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో కేంద్రానికి పలు అదనపు సౌకర్యాలను కల్పించటం అభినందనీయమని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వై.రవీంద్రకుమార్ అన్నారు. భీమడోలు కేంద్రంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగే అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ మౌలిక సదుపాయాలు అభివృద్ధికి అగ్ని భద్రతపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భీమడోలు అగ్నిమాపక కేంద్ర అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఇతరులతో కలిసి చేపట్టారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకొని అమరులైన


భీమడోలులో వారోత్సవాలను ప్రారంభిస్తున్న రవీంద్రకుమార్

అమరవీరులకు నివాళులర్పించారు. అగ్నిమాపక కేంద్ర అధికారి జి.నాగరాజు మాట్లాడుతూ గతేడాది తమ శాఖ ద్వారా స్థానికంగా చేపట్టిన అగ్నిమాపక వారోత్సవాల అవగాహన కార్యక్రవ ాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు అగ్నిమాపక కేంద్ర అధికారి నాగబాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, రూరల్ సిఐ నాయుడు, ఎస్ఐ షణ్ముఖసాయి పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గూటాల పంపింగ్ స్కీం కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీ బస్సు షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొత్త పట్టిసీమ గ్రామ సర్పంచి మైగాపుల విజయదుర్గ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, బాలాజీ, ఎంపిటిసి సభ్యులు వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అడ్డగర్ల సాయిబాబా పాల్గొన్నారు.

టిడిపి నేతల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి సీనియర్ నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్, రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి నేతలు పట్టణం నుంచి మర్రిబందం వరకు శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు నూజివీడు నూజివీడు వస్తున్న నేపథ్యంలో రెండు వేల బైకులతో స్థానిక రాజీవ్ సర్కిల్ నుంచి పట్టణంలో ప్రధాన వీధుల మీదుగా మర్రి బందం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఉత్సాహంగా నియోజకవర్గ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్, జనసేన పార్టీ ఉంగుటూరు నియోజవర్గ బాధ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉంగుటూరులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల్పించారు. అనంతరం క్రికెట్ టోర్నమెంటు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో నాలుగు మండలాల నుంచి 39 టీములు పాల్గొంటాయి. మొదటి లీగ్ మ్యాచ్‌లను రోజుకు నాలుగు చొప్పున నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లు 18న సాయంత్రానికి ముగుస్తాయని, అనంతరం లీగ్ మ్యాచ్ నుంచి విజయం సాధించిన జట్టుకు మరోసారి డ్రా తీస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఫైనల్ పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నారాయణపురం గ్రామ సర్పంచి దిడ్ల అనకనందదేవి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, ఉప్పాకపాడు ఎంపిటిసి సభ్యులు ఇంటి మంగరాజు, అడవికొలను ఎంపిటిసి సభ్యులు నిమ్మల దొరబాబు, కృష్ణంరాజు, చింతలపాటి బాసిరాజు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం జట్టుకు రూ.25 వేలు, తృతీయ స్థానం జట్టుకు రూ.15 వేలు, అలాగే ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్‌కు కూడా నగదు బహుమతులను లక్ష్మీనారాయణ ట్రస్ట్ అందించనున్నారు.



మాట్లాడుతున్న ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మరాజు

ఐదు కరోనా కేసులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలో రెండు కరోనా కేసులు నమోదైనట్లు డా.సుష్మ తెలిపారు. గురువారం దర్భగూడెం నుంచి ఆరుగురిని, జీలుగుమిల్లి నుంచి ఐదుగురిని మొత్తం 11 మందిని శాంపిల్స్ తీసి ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపగా జీలుగుమిల్లి చెందిన ఒకరికి, దర్భగూడేనికి చెందిన ఒకరికి ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు.

నూజివీడు రూరల్ : మండలంలోని పడమర దిగవల్లి గ్రామంలో మూడు కరోనా కేసులు నమోదైనట్లు వైద్య అధికారి డాక్టర్ సునంద తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తులు దిగవల్లి పిహెచ్‌సిలో పరీక్ష చేయించుకోగా కరోనా లక్షణాలు కనిపించాయని తెలిపారు.

నేడు రైల్వేగేటు మూసివేత

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు నుంచి పంగిడిగూడెం వెళ్లే రహదారిలో దెందులూరు రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం శనివారం మూసివేయను న్నట్లు రైల్వే శాఖ డివిజనల్ ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మార్గం ద్వారా వెళ్లే వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.